క్లుప్తంగా

చినుకు పడితే చిత్తడే


బురదమయంగా ఉన్న కాలనీ ప్రధాన మార్గం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని జగనన్న కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కాలనీలో ప్రధాన మార్గంలోసీసీరోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. వెంకటగిరిలో గత రెండు రోజులుగు కురుస్తున్న వర్షాలకు రోడ్లు అంతా బురదమయంగా మారిపోయాయి. దీంతో ఆ మార్గాల గుండా రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని పలువురు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, పాలకులు స్పందించి జగనన్న కాలనీలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందిస్తున్న దాతలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న మేరి అనాథ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు శనివారం వితరణగా దుప్పట్లు, నిత్యావసర సరుకులు, రెండు బియ్యం బస్తాలు, నగదు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన ఆట్లా కృష్ణారావు నాయకులతో కలిసి ఆశ్రమంలో వృద్ధులకు ఈ సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ కుమార్, నాయకులు బాలు శెట్టి, గిండి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

కండలేరులో 27.850 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 27.850 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 6600 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1800, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

21న జాబ్ మేళా


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిల్లకూరు: తిరుపతి జిల్లాలోని పలు పరిశ్రమలు, బహుళజాతీయ సంస్థలో పని చేసేందుకు యువతీ యువకులకు అవకాశం కల్పించేలా ఈ నెల 21న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తెలిపారు. ఆయన స్థానిక ఎమ్మెల్యేతో కలిసి గూడూరు పట్టణం గమళ్లపాళెంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జాబ్ మేళా వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను ముందుగా వెబ్‌సైట్ (https://naipunyam.ap.gov.in/user&registration) లో నమోదు చేసుకోవాలని, స్పాట్ రిజిస్ట్రేషన్ అవకాశం ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు 99850 56929, 86398 35953, 99888 53335 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, ప్లేస్‌మెంట్ అధికారి గణేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

కలువాయిలో ఉచిత వైద్యశిబిరం


వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

కలువాయి(సైదాపురం): మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం పొదలకూరుకు చెందిన ఉన్నతి సర్జికల్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరానికి వచ్చిన ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు		17.8.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	123
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	224
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	250
లేయర్ చికెన్	:	200

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..


చిట్టమూరు : అలంకరణలో శ్రీకృష్ణుడు


శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహించారు. ఉట్టి మహోత్సం, అభిషేకాలు, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణమహోత్సవాలు, హోమాలు, నగరోత్సవాలు అన్నదాన కార్యక్రమాలు కనులపండువలా సాగాయి. గోపికలు, రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు అలరించారు. నాయుడుపేటలో దేవతామూర్తుల వేషధారణలో కోలాట ప్రదర్శన, వెంకటగిరిలో నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. గూడూరులో మహాభారతం లోని పాత్రలతో కళాకారులు అశ్వరథంపై ఊరేగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

– సాక్షి నెట్‌వర్క్


గూడూరు: అశ్వరథంపై శ్రీ కృష్ణార్జున వేషధారులు


నాయుడుపేటటౌన్: సామూహిక కుంకుమార్చన పూజలో మహిళలు


గూడూరు : మహా భారతంలోని పంచ పాండవుల వేషధారులు


సైదాపురం: ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు


వెంకటగిరి : రాధాకృష్ణుల వేషధారణలో అలరిస్తున్న చిన్నారులు


చిల్లకూరు : రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు


వెంకటగిరి : విశేషాలంకరణలో రాధాకృష్ణులు




కోట: చిన్మయామిషన్‌లో కృష్ణాష్టమి వేడుకలు, నాయుడుపేటటౌన్: స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, వెంకటగిరి : రాధాకృష్ణ వేషధారణలో చిన్నారులు

నిబంధనల మేరకే చవితి ఉత్సవాలు


నాయుడుపేట పోలీస్ డివిజన్ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేటటౌన్ : ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రశాంత వాతావణంలో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని డీఎస్పీ చెంచుబాబు సూచించారు. స్థానిక పోలీస్ డివిజన్ కార్యాలయంలో శనివారం వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించే కమిటీ సభ్యులను సమావేశ పరిచి ముందస్తుగా చేపట్టాల్సిన జాగ్రత్త చర్యలపై వారికి అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విగ్రహాలు ఏర్పాటు చేసుకునే ప్రతి ఒక్కరు పోలీసులు, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. అయితే రికార్డు డ్యాన్సులు, అశ్లీల ప్రదర్శనలు వంటివి నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరికలు జారీ చేశారు. విగ్రహ ప్రతిష్ఠ, మండపాల ఏర్పాటు, వేడుకలు, ఊరేగింపు ఎప్పటి వరకు నిర్వహిస్తారో దరఖాస్తుల్లో తెలియజేయాలన్నారు. రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విగ్రహాలను నిమజ్జనానికి తరలించేటప్పుడు మద్యం తాగి వాహనాలను నడిపేతే వారిపై కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరికలు జారీ చేశారు. రహదారుల వద్ద తాళ్లు పట్టుకుని వాహనాలను నిలిపి బలవంతపు వసూళ్లకు పాల్పడరాదని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీతో పాటు నాయుడుపేట అర్బన్ సీఐ బాబి ఉన్నారు.

చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరి

దొరవారిసత్రం : గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలంటే పోలీసుల నుంచి అనుమతులు తప్పనిసరని సీఐ సంఘమేశ్వరావు తెలియజేశారు. చవితి వేడుకల నిర్వహణపై పలు గ్రామాల ప్రజలకు శనివారం డీవీ సత్రం పోలీస్ స్టేషన్ వద్ద అవగాహన సమావేశం నిర్వహించారు. సీఐ, ఎస్ఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా వినాయక ప్రతిమలను ప్రతిష్టించి వేడుకలు నిర్వహించినా, మైక్‌సెట్ పెట్టాలన్నా ముందుగా పోలీసులకు సమాచారం అందించి అనుమతులు పొందాలన్నారు.

నిబంధనలు పాటించాలి

ఓజిలి: వినాయక విగ్రహాల మండపాలను ఏర్పాటు చేసే భక్తులు నిబంధనలు పాటించాలని నాయుడుపేటరూరల్ సీఐ సంగమేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఓజిలి పోలీస్ స్టేషన్‌లో కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విగ్రహాలు మండపాల్లో ప్రతిష్టించే సమయంలో కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పోలీస్ స్టేషన్‌లో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనం చేసే సమయాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. విగ్రహాల వద్ద ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకున్నా కమిటీ సభ్యులదే బాధ్యత అని చెప్పారు. ఈయన వెంట ఎస్ఐ శ్రీకాంత్ ఉన్నారు.

శ్రీకృష్ణుడిగా లక్ష్మీ నరసింహుడు

రాపూరు: మండలంలోని పెంచలకోన పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి శనివారం రాత్రి భక్తులకు శ్రీకృష్ణుడిగా దర్శనమిచ్చారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్వామివారి అలంకార మండపంలో శేష వాహనంపై పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ ఉత్సవర్లను కొలువుదీర్చారు. స్వామివారిని శ్రీకృష్ణుడిగా అలంకరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కోన మాఢ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవిగ్రహాలకు పాలు , తేనే, పెరుగు, చందనం, వివిధరకాల పండ్లరసాలతో స్నపన తిరుమంజనం, హోమం , కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి వైఎస్సార్ కడప జిల్లా వాస్తవ్యులు డాక్టర్ విజయకిషోర్‌రెడ్డి దంపతులు శనివారం రూ.1.5 లక్షల నగదును విరాళంగా అందించినట్లు ఏసీ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.


శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి అమ్మవారు


నగదు విరాళం అందిస్తున్న విజయకిషోర్‌రెడ్డి

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నాయుడుపేటటౌన్: మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆ సంఘం మహిళ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఫజరియా, కే విజయమ్మల అధ్యక్షతన మండల పరిధిలోని భోజన పథక కార్మికులతో సమావేశం నిర్వహించారు. తమ ప్రధాన సమస్యలైన కార్మికులకు కనీస వేతనంతో ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం, గ్యాస్, వంట పాత్రలు ప్రభుత్వమే సరఫరా చేయాలని, విద్యార్థుల మెనూ చార్జీలు పెంచాలని, రాజకీయ వేధింపులు లేకుండా చూడాలని ఇంకా అనేక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ పోరాటలకు సన్నద్ధమవుతున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ముకుందా, భోజన పతక కార్మికుల సంఘం మహిళ నాయకులు వెంకటగిరి రోజా, సుగుణమ్మ, కోట లక్ష్మీ, ప్రమీలమ్మ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘ మహిళలు

అధినేత వైఎస్ జగన్ పరామర్శ


రాంప్రసాద్‌రెడ్డిని పరామర్శిస్తున్న పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం ఫోన్‌లో పరామర్శించారు. ఈ నెల 7వ తేదీన కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి, డక్కిలి మండల జెడ్పీటీసీ సభ్యురాలు మృతి చెందడంపై వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. త్వరలో వెంకటగిరికి వచ్చి కలుస్తామని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్నేటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి శనివారం కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకుని కలిమిలి రాజేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలిమిలి రాంప్రసాద్‌రెడ్డిని పరామర్శించి సానుభూతిని తెలిపారు.

మేరిగకు వైఎస్ జగన్ పరామర్శ

చిల్లకూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్‌ను ఫోన్‌లో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. రెండు రోజులక్రితం మురళీధర్ తండ్రి ఆనందరావు కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఫోన్ చేసి మేరిగ మురళీధర్‌తో మాట్లాడారు. ఆయన మృతికి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆనందరావు ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఫోన్‌లో పరామర్శించినట్లు మేరిగ తెలిపారు.

కిక్కిరిసిన రాపూరమ్మ ఆలయం

రాపూరు: మండల కేంద్రంలోని గ్రామ దేవత రాపూరమ్మ ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. అమ్మవారి జాతరలో భాగంగా రెండో రోజు ఉదయం అభిషేకం, పూలంగి సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం ఎదుట మైల ముగ్గువేసి అమ్మవారికి దిష్టి తీసివేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. రాత్రి గంగపెట్టెను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు.


విశేషాలంకరణలో రాపూరమ్మ

● రోడ్డంతా గుంతలే

సైదాపురం: మండల కేంద్రం నుంచి ఊటుకూరు వరకు ప్రయాణించాలంటేనే వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు. రెండు కిలోమీటర్ల వరకు అడుగుకో గుంత ఉండడంతో నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఊటుకూరు నుంచి డేగపూడి వరకు ఉన్న రహదారి ధ్వంసమైంది.


ఊటుకూరు సమీపంలో గుంతల మయంగా ఉన్న రహదారి



నేలకొరిగిన వరి

చిట్టమూరు: మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎడగారులో సాగు చేస్తున్న వరి పంట నేలవాలి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గతంలో కురిసిన వర్షాలకు నేలవాలిన వరి పైరులోని గింజలు మొలకెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గునపాడు, మెట్టు, తిమ్మారెడ్డివాగు, పెళ్లకూరు గ్రామాల్లో స్వల్పకాలిక వంగడం ఎంటీయూ 1010 రకాన్ని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి కోతలు కోస్తున్నారు. అయితే వర్షం కురవడంతో రైతులు కోతలు కోయడం ఆపేశారు. నేల వాలిన పైరు ధాన్యం గింజలు మొలకరావడంతో రైతులు ధాన్యం ఎలా అమ్ముకోవాలని ఆందోళన చెందుతున్నారు. పైరు పూర్తిగా నేలపై వాలిపోవడంతో పాచి పోయి కోత కూడా కోయలేని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. మండలంలో సుమారు 250 ఎకరాల్లో వరి పైరు నేల వాలిపోయిందని రైతులు పేర్కొన్నారు. బాగున్న ధాన్యానికే గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న తరుణంలో పిడుగులా వర్షం కురవడంతో తీవ్రంగా నష్టపోతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.


నేలవాలి పాచిపోయిన వరిపంట


పంట కోయకనే మొలకెత్తిన ధాన్యం


మెట్టు గ్రామంలో నేలవాలిన వరిపంట